క్లుప్తంగా

హైవేలో ట్రాఫిక్‌కు అంతరాయం



హైవేలో సోడా కొట్టు ఉండటంతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

దెందులూరు: జాతీయ రహదారిపై సర్వీస్ రోడ్డులో దెందులూరు గ్రామంలోనికి వచ్చే బ్రిడ్జి ఎదురుగా రోడ్డుపై సోడాల కొట్టు వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుండుగొలను, ఏలూరు, దెందులూరు వైపు వెళ్లేందుకు సెంటర్ కావడంతో వాహనాల రద్దీ ఉంటుంది. ఈ కొట్టు వల్ల లారీలు, ట్రాక్టర్లు వెళ్లేటప్పుడు తీవ్ర అసౌకర్యంగా ఉందని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా కొట్టును వేరే ప్రాంతంలో పెట్టేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని ట్రాక్టర్లు, లారీల డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు.

22న దెందులూరు మండల సర్వసభ్య సమావేశం

దెందులూరు: దెందులూరు మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు దెందులూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొమ్మిన బోయిన సుమలత అధ్యక్షతన జరుగుతుందని దెందులూరు ఎంపీడీఓ కే శ్రీదేవి తెలిపారు. మండలంలో ఎంపీటీసీలందరూ అన్ని శాఖల మండల అధికారులు విధిగా సమావేశానికి హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

భీమడోలు: పరిసరాల పరిశుభ్రత ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని భీమడోలు ఎక్సైజ్ సీఐ బి.సత్యనారాయణ అన్నారు. స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా భీమడోలులో శనివారం ఎక్సైజ్ శాఖ సీఐ బి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో స్వచ్ఛ సేవ కార్యక్రమాలు జరిగాయి. పాఠశాలలోని ఆవరణాలు, తరగతి గదులను పరిశుభ్రం చేయించారు. మొక్కలు నాటారు. భీమడోలు బస్టాండ్‌లోని చెత్తా చెదారాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని, విద్యార్థి దశ నుంచి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు, కరస్పాండెంట్ కె.ప్రేమ్‌కుమార్, ప్రిన్సిపల్ శ్రీనివాస్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈస్టర్ పండుగకు సర్వం సిద్ధం

దెందులూరు: మండలంలో సమాధుల పండుగకు సర్వం సిద్ధమైంది. ఆదివారం తెల్లవారుజామున మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు సమాధుల వద్దకు వెళ్లి నివాళులర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ఇందుకుగాను మృతుల కుటుంబ సభ్యులు సమాధులను శుభ్రం చేశారు. అన్ని గ్రామాల్లో సాల్వేషన్ ఆర్మీ కోర్ ఆఫీసర్లు సమాధుల తోటల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. శనివారం దెందులూరు సమాధుల తోట నుకోర్ ఆఫీసర్ ఎం రమణయ్య పరిశీలించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బ్రోచర్ ఆవిష్కరణ

ఉంగుటూరు: నారాయణపురం అరవిందశత జయంతి ప్రభుత్వ డిగ్రీకళాశాల 2025–26 సంవత్సరానికి చెందిన బ్రోచర్‌ను ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి శనివారం ఆవిష్కరించారు. ప్రిన్సి పాల్ టి కె విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలోజరిపిన కార్యక్రమంలో ప్రొఫెసర్‌డా. కొండా రవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఎంపీపీ గంటాశ్రీలక్ష్మి ఈసందర్భంలో మాట్లాడు తూ డిగ్రీకళాశాలకు నేక్ గుర్తింపు లభించడం మంచి పరిణామమన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతంగా ఎదగాలని ఆకాక్షించారు.

దెందులూరు ఉపాధి టీఏగా పెదబాబు

దెందులూరు: దెందులూరు మండలం జాతీయ ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్‌గా పెదబాబు ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేసిన శ్రావణ్ చింతలపూడి మండలం టెక్నికల్ అసిస్టెంట్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ద్వారకాతిరుమల నుంచి పెదబాబు దెందులూరుకు బదిలీపై వచ్చారు. ఎంపీడీవో కే శ్రీదేవి, ఏవో భీమరాజు, ఇంచార్జి ఏపీఓ ఫాతిమాలను మర్యాదపూర్వకంగా పెదబాబు కలిశారు.

దెందులూరులో స్వచ్ఛ ఆంధ్ర



పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే

దెందులూరు: నియోజకవర్గ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సోమవరప్పాడు బైపాస్ వద్ద ప్రారంభించారు. దెందులూరు, పెదవేగి రెండు మండలాల్లో 11 గ్రామాల్లో ఐదు గంటలసేపు ప్రజల భాగస్వామ్యంతో రోడ్ల కిరువైపులా చెత్తను ఎక్కించి ట్రాక్టర్ల ద్వారా కేంద్రాలకు పంపించారు.

పీ4 కాదు.. పీడించే సర్వే!

- పీ–4 సర్వేతో ప్రజల్లో భయం
- 27రకాల ప్రశ్నలతో సచివాలయ ఉద్యోగుల సర్వే
- సంక్షేమ పథకాల్లో కోత కోసమే సర్వే అని ప్రజల అనుమానం
- ఇంట్లో వస్తువుల వివరాలన్నీ నమోదు

మీ ఇంట్లో ఫ్రిడ్జ్ ఉందా.. టీవి ఉందా..ఇంట్లో ఏసీ ఉందా, బైక్ ఉందా, మీ ఇంట్లో ఎన్ని స్మార్ట్ ఫోన్‌లు ఉన్నాయి. మీరు ప్రైవేటుగా జాబ్ చేస్తున్నారా...మీకు జీతం ఎంతొస్తుంది..ఇలా రకరకాల పేరుతో సర్వే చేసి ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులు పెడుతోంది. ప్రజల, ఆర్థిక సామాజిక స్థితిగతుల అంచనా పేరుతో సంక్షేమ పథకాలను కోత వేయడమే లక్ష్యంగా పీ–4 సర్వే సాగుతోందని పలువురు విమర్శిస్తున్నారు.

దెందులూరు: కూటమి అధికారంలో వచ్చి 11నెలలు గడుస్తున్నా ఏఒక్క పథకం అమలుకు నోచుకోలేదు. కేవలం ఊకదంపుడు ఉపన్యాసాలు, సర్వేల పేరుతో కాలయాపన చేయడమే లక్ష్యంగా కొనసాగుతుంది. ఏమాత్రం చిత్తశుద్ధి లేకుండా సూపర్‌సిక్స్ హామీలను గాలికొదిలేసి ప్రజలను ఇబ్బందులు పెడుతోంది. పీ–4సర్వే ప్రజా సంక్షేమమం కోసమా, ప్రభుత్వ పథకాల అమల్లో కోత పెట్టడం కోసమో అర్థంకాక ప్రజలు తలలు పట్టుకుంటున్నారు. గత ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు సూపర్‌సిక్స్ అంటూ ఊదరగొట్టారు. ఇంటింటికీ కరపత్రాలు పంచి మీ ఇంటికి ఈ పథకాలన్నీ అందజేస్తాం. మీకు అంతా మేలు జరిగేలా చూస్తాం అంటూ నమ్మించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మీ జీవితాలు మెరుగుపడతాయని నమ్మబలికారు. తీరా అధికారంలోకి వచ్చాక 11నెలలు దాటుతున్నా పథకాల అమలుకు నోచుకోలేదు. చెప్పిన వాగ్దానాలు అమలు చేయకుండా నున్నాయి. నొక్కులు నొక్కుతున్నారు. తాజాగా పీ–4సర్వే పేరిట ఉన్న సంక్షేమ పథకాలను ఎత్తివేసేందుకు లేదా కొత్త పథకాల్లో కోత విధించేందుకు పాలకులు శ్రీకారం చుట్టారా అనే అనుమానం ప్రజల్లో వ్యక్తం అవుతోంది.

అన్ని వివరాల నమోదు...

సర్వేలో భాగంగా సచివాలయ ఉద్యోగులు ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు నమోదు చేసుకుంటున్నారు. మీఇంటిలో టీడీ, ఏసీ, ఫోర్ వీలర్, టూ వీలర్ ఇతర గృహోపకరణఋలు ఇంకేమైనా ఉన్నాయంటూ వాటి వివరాలు నమోదు చేసుకుంటున్నారు. ఇళ్ల స్వరూపం రేకులషెడ్డా, స్లాబా అంటూ ఇంటిని పరిశీలించి నమోదు చేస్తున్నారు.



బ్యాంకు ఖాతా వివరాలు కూడా అడుగుతున్నారు. ఇలా 27రకాల ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టి నమోదు చేస్తున్నారు. సర్వే అనంతరం ప్రజల ఫోన్‌కు ఓటీడీ పంపి ఆ ఓటీపీ తెలుసుకుని యాప్‌లో నమోదు చేసి సర్వేను ముగిస్తున్నారు. దారిద్ర్య కేఖకు దిగువన ఉన్న కుటుంబాల వారు సైతం అప్పోసప్పో చేసి నెలవారీ వాయిదాల్లో ఇళ్లల్లో వస్తువులను ఏర్పాటు చేసుకొని ఉంటారు. అయితే ఆ వస్తువులు ఇంట్లో ఉన్నాయని తెలిస్తే చాలు వెంటనే సదురు వివరాలు సచివాలయ సిబ్బంది ప్రభుత్వ రికార్డులో నమోదు చేస్తున్నారు.

నిరాకరించినా నమోదు

సర్వేలో సిబ్బంది పొందుపర్చే అంశాలు ప్రస్తుత జీవన శైలిలో భాగమైనవే. స్మార్ట్ ఫోన్ , బైక్‌ఉన్నాయా లాంటా ప్రశ్నలు ఉండడంతో సంక్షేమ పథకాల్లో కోత పడుతుందనే ఆందోళన ప్రజల్లో సైతం నెలకొంది. సర్వేకు ఎవరైనా నిరాకరిస్తే వారి పేర్లను సైతం నమోదు చేయాలనే ఆదేశాలు సిబ్బందికి జారీ చేయడం కలవరానికి గురిచేస్తోంది.

నమ్మండయ్యా బాబూ...

పీ–4 సర్వే అన్ని గ్రామ సచివాయాల పరిధిలో కుటుంబాలను సర్వే చేస్తున్నారు. సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి వివిధ రకాల సమాధానాన్ని సేకరించి యాప్‌లో నమోదు చేస్తున్నారు. సర్వే పకడ్బందీగా నిర్వహించాలని, దీన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని చెబుతున్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల గుర్తింపు కోసం ఈ సర్వే దోహద పడుతుందనే అంశాన్ని ప్రజలకు తెలియజేయాలని క్షేత్రస్థాయిలో సిబ్బందికి అధికారులు చెప్పినట్లు సమాచారం. ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలు యాథావిధిగా కొనసాగుతాయని అందులో ఎలాంటి అపోహాలొద్దని చెబుతున్నా క్షేత్రస్థాయిలో ప్రజల్లో మాత్రం అయోమయం నెలకొంది.

లబ్ధిదారుల సంఖ్య తగ్గించేందుకే సర్వే

ప్రస్తుత ప్రభుత్వం సంక్షేమ పథకాల లబ్ధిదారుల సంఖ్య తగ్గించేందుకు అనేక ప్రయత్నాలు చేస్తోంది. వచ్చి పది నెలలు దాటుతున్నా ఇప్పటి వరకు సంక్షేమ పథకాలు అమలు చేయలేదు. పీ–4 సర్వే చేస్తుండడమంతో గ్రామాల్లోని ప్రజల్లో భయం నెలకొంది. గత ప్రభుత్వంలో చాలా పథకాలు వచ్చాయి. సర్వేలు చేస్తుండటం పథకాల్లో విధిస్తే లబ్ధిదారులు నష్టపోతారు.

పథకాల్లో కోత విధించేందుకే



కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలను అమలు చేయాలేకనే పీ–4 సర్వే అంటూ ప్రజలను మోసం చేస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇటువంటి సర్వేలు నిర్వహించలేదు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందజేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసేవి విధంగా చర్యలు తీసుకోవాలి.

– డీబీఆర్‌కే చౌదరి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి



నెలలు తరబడి ప్రభుత్వం అమలు చేసే సూపర్ సిక్స్ పథకాలకు లబ్ధి కోసం వేలాది మంది ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ పథకాల అమలుతో అనేక రంగాల ప్రజలు జీవన విధానం ముడిపడి ఉంది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసేవి విధంగా చర్యలు తీసుకోవాలి.

– శనివల్లి రామకృష్ణ (విష్ణు), సర్పంచ్ సానిగూడెం

ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరు



పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం గణపవరం సమితి నూతన కమిటీ సభ్యులు

గణపవరం: ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, డి.ఏ బకాయిలు చెల్లించి, పిఆర్‌సీని ఏర్పాటు చేయాలని ఏపీ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.శ్రీధర్‌రాజు, కె.ప్రసన్న అన్నారు. పంచాయతీరాజ్ ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని, పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల హక్కుల సాధనే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు. శనివారం గణపవరం బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన గణపవరం పంచాయతీ సమితి (గణపవరం, నిడమర్రు, పెంటపాడు మండలాలు) ఏరియా పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఈసందర్భంగా గణపవరం సమితి నూతన కమిటీ ఎన్నికలను నిర్వహించారు. నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్లు ఎన్నికల పరిశీలకులు ప్రకటించారు. ఈకమిటి మూడు సంవత్సరాలు అధికారంలో ఉంటుందన్నారు. ఈఎన్నికకు మూడు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో పంచాయతీరాజ్, మినిస్టీరియల్ ఉద్యోగులు పాల్గొన్నారు. అధ్యక్షుడిగా గణపవరానికి చెందిన కాకిలేటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా పిఎస్‌ఆర్ కిషోర్, ప్రధాన కార్యదర్శిగా ఎం .యజ్ఞసంతోష్, సహాయ కార్యదర్శిగా ఎస్‌ఎస్‌వి శ్రీనివాస్, కోశాధికారిగా ఎస్.సీతారామరాజు, జిల్లా కౌన్సిలర్స్‌గా హోతా రామకష్ణ, ఐవీరాస్వామి ఎన్నికయ్యారు. ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటి సభ్యులతో పదవీప్రమాణం చేయించారు. పలువురు నూతన కమిటీ సభ్యులను పూలమాలలతో అభినందించారు. ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు కాకిలేటి శ్రీనివాస్ మాట్లాడుతూ పంచాయతీ రాజ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం



భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంటలను ఆదుపు చేస్తున్న అగ్నిమాపక అధికారి, సిబ్బంది

భీమడోలు: అగ్నిప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని భీమడోలు అగ్నిమాపకాధికారి జి.నాగరాజు అన్నారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆరో రోజైన శనివారం భీమడోలు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో సంభవించే అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. కరపత్రాలను అందించారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం, ఆరోగ్యమాతా జనరల్ ఆసుపత్రుల్లో మాక్ డ్రిల్‌ను నిర్వహించారు. అక్కడ వైద్యులు, సిబ్బందికి ప్రతి అంశంపై సిబ్బంది అవగాహన కల్పించి వారిని భయం లేకుండా వారిని చైతన్యపర్చారు. ఆసుపత్రుల్లో జరిగే విద్యుత్ షాక్ సర్క్యూట్ వల్ల సంభవించే ప్రమాదాలు, వాటి నివారణపై అవగాహన కల్పించారు. గ్యాస్ సిలిండర్ లీకైన తరుణంలో ఎటువంటి ఆందోళన చెందకుండా ఆ మంటను నియంత్రించడంపై వారికి వివరించారు. వేసవిలో ఎక్కువ అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలున్నందున వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆస్తి నష్టం, ప్రాణ నష్టం వాటిల్లకుండా సకాలంలో ప్రమాదాలను తెలియజేయాలని కోరారు. ఆసుపత్రుల్లో అగ్నిమాపక ప్రమాదాలు జరగకుండా ముందుగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సునీత, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

భీమడోలు: ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందజేస్తున్నట్లు భీమడోలు ఎంఈవో 1 ఈదుపల్లి శ్రీనివాసరావు అన్నారు. భీమడోలు నెం .3, నెం.4 ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం బడి ఈడు పిల్లలను చేర్పించే ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌ఎంలు రెడ్డియ్య, బుల్లిదొరలతో కలిసి ఇ.శ్రీనివాసరావు ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లు నిండిన చిన్నారులను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని వారి తల్లిదండ్రులను కోరారు. భీమడోలు నెం.4 పాఠశాల ఏరియాల్లో ర్యాలీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలే ముద్దు... ప్రైవేటు పాఠశాలలే వద్దు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైవిధ్య తరహాలో విద్యాబోధనను అందించేందుకు నూతన విద్యా విధానం అమలవుతుందన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులను పూర్తిస్థాయిలో అమలు చేస్తోందన్నారు. భీమడోలు నెం.4 పాఠశాలను ఆదర్శ పాఠశాలగా ఎంపికైందన్నారు. పాఠశాలకు



పాఠశాల పరిధిలో చిన్నారులకు అడ్మిషన్లు అందజేస్తున్న ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు

చెందిన ఇద్దరు చిన్నారులు రాష్ట్రీయ స్టడీ టూర్‌కు ఎంపిక కావడం జరిగిందన్నారు. ప్రైవేటు పాఠశాలల మోజులో పడి చిన్నారులను చేర్పించవద్దని, సర్కారు బడుల్లో ఉత్తమ విద్యాబోధన అందుతుందన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఐదేళ్ల నిండిన పలువురు చిన్నారులకు అడ్మిషన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీచర్లు ఎం.శరీన్, కె.పరమానందం, మేరీప్రసాద్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పైలెట్ ప్రాజెక్టుకు రామారావుగూడెం, ముప్పవరం గ్రామాల ఎంపిక



బీ. సుమతి

దెందులూరు: మండలంలో రీ–సర్వే పైలెట్ ప్రాజెక్టు గ్రామాలుగా ముప్పవరం, రామారావుగూడెం గ్రామాలను ప్రభుత్వం ఎంపిక చేయడం జరిగిందని దెందులూరు తహసీల్దార్ బీ.సుమతి అన్నారు. శనివారం రామారావుగూడెంలో రీ– సర్వే దెందులూరు మండల్ డిప్యూటీ తహసీల్దార్ రవిచంద్ర ఆధ్వర్యంలో సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ మండల సర్వేయర్, గ్రామ సర్వేయర్లు, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు రెండు గ్రామాల్లో రీ సర్వే కార్యక్రమాన్ని అంకితభావం ప్రణాళిక సమన్వయంతో ప్రభుత్వ లక్ష్యాలు సాధించాలన్నారు. రైతులకు విధిగా ముందస్తు సమాచారం తెలియజేయాలని నోటీసులు ఇవ్వాలని రీ– సర్వేకు సంబంధించి జవాబు దారి తనాన్ని ఉద్యోగులందరూ పాటించాలన్నారు.

భూసర్వేలోని అభ్యంతరాలన్నీ పరిష్కరిస్తాం



సూరప్పగూడెంలో రైతు సమస్యను తెలుసుకుంటున్న తహసీల్దార్ రమాదేవి

భీమడోలు: భూసర్వేలోని అభ్యంతరాలన్నింటికి గడువులోగా పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని భీమడోలు తహసీల్దార్ బి.రమాదేవి అన్నారు. సూరప్పగూడెం పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం భూ సర్వేలో భాగంగా అభ్యంతరాల స్వీకరణకు గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామసభకు మండల సర్వేయర్ ఎస్.ధర్మారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ రమాదేవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన సూరప్పగూడెంలో భూసర్వే పూర్తి అయ్యిందన్నారు. 1180 మంది రైతులకు చెందిన 2,381 విస్తీర్ణంలో భూమిని ఆధునిక టెక్నాలజీ సాయంతో సర్వే పూర్తి చేశామన్నారు. రైతులకు ఎటువంటి అనుమానాలు, అభ్యంతరాలున్నా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసుకోవచ్చునన్నారు. మూడు వారాల్లో వాటిన్నింటిని పరిష్కరిస్తామన్నారు. అనంతరం పలువురు రైతులు తమ భూమిలో విస్తీర్ణం తగ్గిందని, వాటిని సరిచేసి తమకు దస్తావేజు మేర విస్తీర్ణం ఇవ్వాలని కోరారు. వాటిని మరోసారి సర్వే గడువులోకి పరిష్కరిస్తామని, ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో ప్రవీణ్‌కుమార్, సర్వేయర్ పవన్‌కుమార్‌లు, వార్డు సభ్యురాలు ఎం.కృష్ణకుమారి, గ్రామసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గోపినాథపట్నం శివాలయంలో విశేష పూజలు



గోపినాథపట్నంలో విగ్రహ ప్రతిష్ఠ పూజలు నిర్వహిస్తున్న మాజీ మంత్రికొట్టు సత్యనారాయణ దంపతులు

ఉంగుటూరు: గోపినాధపట్నం గ్రామంలో శ్రీభ్రమరాంభ సమేత మల్లికార్జున స్వామి, శ్రీదేవిభూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారం ప్రారంభించారు. ఈనెల 23 వరకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్ల ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. నూతనంగా నిర్మించిన శివాలయంలో వినాయకస్వామి, కుమారస్వామి, ధ్వజస్తంభం, శిఖర, సహిత శ్రీభమరాంభసమేత ప్రతిష్ఠా మహక్షత్సవాలు లోక కళ్యాణార్థం వైభవంగా నిర్వహిస్తున్నారు. దేవదాయ శాఖ మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు కొట్టు సత్యానారాయణ, సాదిని కుమారి దంపతులు ఈపూజలు శనివారం నిర్వహించారు. శాంతి మంత్ర పఠనం, గణపతి పూజ, పుణ్యాహవచనము, గోపూజ తదితర పూజలు చేశారు. విగ్రహలకు పంచగవ్య సంప్రోక్షణ, నీరాజన మంత్రపుష్పాలు పూజలు చేశారు. తాడేపల్లిగూడెం పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొలుకులూరి ధర్మరాజు, మార్కెటు కమిటీ మాజీ చైర్మెన్ సంపత్ కుమార్, కైకాల శ్రీను, పెంటపాడు మండల వైఎస్సార్‌సీపీ పి గౌరవ అధ్యక్షుడు సాంభయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు ,సూర్యచంద్రరావు, పెనుగొండ ఆంజనేయలు, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి



భీమడోలు: సూరప్పగూడెంలో ఇంటింటికీ వెళ్ల పొడి,తడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



గణపవరం: పంచాయతీ కార్యాలయం వద్ద స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్

భీమడోలు: ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూనలలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని భీమడోలు తహసీల్దార్ బి.రమాదేవి, ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవిలు అన్నారు. మండల వ్యాప్తంగా 13 గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛంధ్ర– స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించార. పలు గ్రామాల్లో ఎలక్ట్రానిక్ వస్తువులు, ప్లాస్టిక్ వ్యర్థాలు, పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్యం తదితర అంశాలపై అవగాహన సదస్సులను నిర్వహించారు. గ్రామాల్లో సభలు, ర్యాలీ, మానవహారం, ప్రతిజ్ఞలు చేశారు. ప్లేకార్డులను చేతపట్టుకుని పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. పోలసానిపల్లి గ్రామంలో సర్పంచ్ షేక్ రహీమాబేగం ఆధ్వర్యంలో ఈ వస్తువులు, వాటి వినియోగం, తదతర అంశాలపై పురవీధుల్లో ర్యాలీ చేశారు. రాష్ట్ర రహదారిపై మానవహారం చేశారు. సూరప్పగూడెం గ్రామంలో తహసీల్దార్ బి.రమాదేవి, ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, ప్రత్యేకాధికారి ఏ.సుందరిలు ఇంటింటికీ వెళ్లి ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించి వాటిని డంపింగ్ యార్డ్‌లకు సకాలంలో చేరేలా పారిశుద్ధ్య సిబ్బంది తమ వంతు కృషి చేయాలని సూచించారు. పూళ్లలో సర్పంచ్ దాయం సుజాత మొక్కలు నాటారు. కురెళ్లగూడెంలో ఎలక్ట్రానిక్ వస్తువులను సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించారు. ఈ కార్యక్రమాల్లో కార్యదర్శులు కేవీఎం తనూజ, జయరామకృష్ణ, మురళీ, ముత్తయ్య, సచివాలయ ఉద్యోగులు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛతతోనే అందరికీ ఆరోగ్యం

గణపవరం: ప్రతిఒక్కరూ స్వచ్ఛతకోసం పాటుపడాలని, అప్పుడే సమాజంలో అందరూ ఆరోగ్యకరమైన జీవనం సాగించవచ్చునని గణపవరం తహసీల్దార్ అప్పారావు, ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి అన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా గణపవరం పంచాయతీ కార్యాలయం వద్ద స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. ఈవేస్ట్ పరికరాలను గణపవరం పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన ఈవేస్ట్ కౌంటర్‌లో అప్పగించాలని సూచించారు. సర్పంచ్ మూర అలంకారం మాట్లాడుతూ స్వచ్ఛ గణపవరం ఏర్పాటుకు ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రతినిదులు సహకరించాలని కోరారు. గణపవరం పీహెచ్‌సీ సిబ్బంది స్వచ్ఛతా ప్రదర్శన నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిరుపయోగంగాఉన్న ఎలక్ట్రానిక్ పరికరాలను ఎక్కడపడితేఅక్కడ పడవేయ రాదని వైద్యాధికారి కిరణ్మయిఅన్నారు. స్వచ్ఛత పాటిస్తామని నినాదాలు చేస్తూ గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. మండలంలోని పలు గ్రామ పంచాయతీ కార్యాలయాలు, ప్రభుత్వ జూనియర్, డిగ్రీకాలేజి లలో స్వచ్ఛఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు.